# 58

# గురువుగారి అభిమానం

అది పదో తరగతి గది!

అక్కడితో పిల్లలకి హైస్కూలు చదువు ఆఖరు! ఆ తరువాత ఇంక కాలేజీలో అడుగుపెట్టారు.

సుబ్బయ్యశాస్త్రిగారు తెలుగు పాఠం చెప్తున్నారు. ఆయన ఎంతో చక్కగా పాఠం చెప్తున్నా పిల్లలు సరిగా వినడం లేదు. ముందు బెంచీలలో కూర్చున్నవాళ్ళు మాత్రం- అరుపులూ, కూతలూ మొదలు పెట్టారు.

"పిల్లలూ! ఇంక మీకు పరీక్షలు రెండు నెలలే ఉన్నాయి. మీరు శ్రద్ధగా వినకపోతే ఎలా ప్యాసవుతారు? నిశ్శబ్దంగా ఉండండి!" అని అన్నారు శాస్త్రిగారు. కొంచెంసేపు ఊరుకున్నట్లే ఊరుకుని మళ్ళీ అల్లరి మొదలు పెట్టారు పిల్లలు.

రాజు – గాడిద ఓండ్ర పెట్టినట్లుగా వెనక బెంచీ నుంచి అరిచాడు.

పిల్లలంతా గొల్లున నవ్వారు.

"ఒరేయ్! ఎక్కడరా ఆ గాడిద...?" అన్నారు శాస్త్రిగారు.

"ఇక్కడ కాదు మాస్టారూ.... బయట ఉంది!" అని వెనక బెంచీ నుంచి ఎవరో సమాధానం చెప్పారు.

"ఓహో... అలాగా! బహుశా... ఇక్కడ తన బంధువుల కోసం వచ్చి పిలుస్తున్నట్లుంది!" అన్నారు మాస్టారు.

మళ్ళీ పిల్లలు గొల్లున నవ్వారు.

"సైలెన్స్... సైలెన్స్..!" అని డస్టరుతో బల్లమీద తాటించారు శాస్త్రిగారు. ఆ కూతలు రాజు కూస్తున్నాడని ఆయన గ్రహించారు.



"ఒరేయ్ రాజూ... ఇలా రారా..!" అని గట్టిగా పిలిచారు శాస్త్రిగారు.

క్లాసులో నిశ్శబ్దం ఆవరించింది.

రాజు భయంగా నిలబడ్డాడు.

"మాస్టారూ...నేను...నేను..." అతంటూ నసగబోయాడు.

"ఒరేయి.... నేను నిన్నిక్కడికి రమ్మన్నానే కాని, ఏమీ సంజాయిషీ చెప్పమనలేదే..! టేబుల్ దగ్గరకు రా!" అన్నారు శాస్త్రిగారు.

రాజు బెదురుతూ, నెమ్మదిగా టేబుల్ దగ్గరకి వచ్చాడు.

వాడు వచ్చే లోపల మాస్టరుగారు ఒక కాగితం మీద ఏదో వ్రాసి ఆ కాగితాన్ని మడిచి ఉంచారు.

రాజు – మాస్టరుగారు తనని కొడతారనే భయపడ్డాడు.

"మాస్టారూ... నేను..." అంటూ కొట్టమన్నట్లుగా చెయ్యి సాచాడు.

"ఒరేయి... ఈ కాగితాన్ని ఇంటికి తీసుకునిపోయి చదువుకోరా..!" అంటూ ఆ మడిచి వున్న కాగితాన్ని రాజు చేతిలో పెట్టారు శాస్త్రిగారు.

కొట్తారేమోనని భయపడ్డ రాజు - అది చూసి బిత్తర పోయాడు.

"అలాగే సార్..!" అంటూ కాగితాన్ని జేబులో పెట్టుకున్నాడు రాజు.

"ఇంక పోయి నీ సీట్లో కూర్చో..!" అన్నారు మాస్టరుగారు.

రాజు వెళ్లి సీట్లో కూర్చున్నాడు.

"ఒరే! ఏమిట్రా ఆ కాగితం..? ఇలా ఇయ్యరా!" అన్నారు ప్రక్కనున్న విద్యార్థులు.

"అమ్మో! ఇక్కడ కాదు, ఇంటికి వెళ్లి చదువుకోమన్నారు మాస్టర్‌గారు!" అన్నాడు రాజు.

"సైలెన్స్... సైలెన్స్!" అని అరిచాడు మాస్టర్‌గారు.

తర్వాత కొంతసేపటికి క్లాస్ బెల్ మ్రోగింది. పిల్లలందరూ బయటకు వెళ్లారు.

ఇంటికి వెళ్ళాక రాజు - మాస్టరుగారు ఇచ్చిన కాగితాన్ని తీసి చూశాడు.

అందులో 'రాజూ! క్లాసులో గాడిదలాగా కూయవలసిన అవసరంలేదు. సెలవుల్లో నీ రిజల్ట్సు వచ్చాక తీరికగా ఏడవచ్చు' అని రాసి వుంది.

'అమ్మో! ఈ మాస్టరుగారు నన్ను ఎంత మాట అన్నాడు?! నేను పరీక్ష తప్పి ఏడవాలని శాపం పెడ్తాడా..?! లేదు. నేను బాగా చదివి మంచి మార్కులతో ప్యాసయి, నన్నిలా అన్నందుకు ఆయనకి సిగ్గు వచ్చేటట్లు చేయాలి' అనుకున్నాడు రాజు.

దాంతో రాజులో పట్టుదల బాగా పెరిగింది.

ఎంతో కష్టపడి చదివాడు.., పరీక్షలు చాలా బాగా వ్రాశాడు. మాస్టరుగారి మీద మాత్రం- మనసులో చెప్పలేనంత కోపంగా ఉంది. అలా రాయడం కంటే... బెత్తంతో రెండు దెబ్బలు వేసినా ఇంత బాధ అనిపించేది కాదు.

◎ ◎ ◎

ఆరోజు ప్రొద్దున్నే తెలతెలవారుతుండగానే వచ్చిన దిన పత్రికలో పరీక్షాఫలితాలు చూశాడు రాజు. అనుకున్నట్లే ఫస్టుక్లాస్‌లో ప్యాసయ్యాడు.

వెంటనే సైకిల్ తీసుకుని శాస్త్రిగారి ఇంటికి బయలు దేరాడు.

'ఈ పేపర్ ఆయన ముఖం మీద కొట్టాలి. నేను తప్పుతానని మీరు దీవించినా ఫస్టుక్లాసులో పాసయ్యాను. ఇప్పుడేమంటారు?' - అని అడగాలి. 'అలా అన్నందుకు ఆయన ఏడవాలి!' అనుకుంటూ త్వర త్వరగా సైకిలు తొక్కుతూ మాస్టర్‌గారింటికి వెళ్లాడు.

"మాస్టారూ..." అంటూ వీధిలోంచే గట్టిగా పిలిచాడు.

శాస్త్రిగారు బయటకు వచ్చారు. రాజును చూసి, "ఏమిట్రా... చీకటితో వచ్చావు?" అన్నారు.

"మాస్టారూ... ఇదుగో, ఈ వేళ రిజల్ట్స్ వచ్చాయి!" అంటూ పేపర్ చూపించాడు.

"నువ్వు ఫస్టు క్లాస్‌లో ప్యాసయ్యావు కదరా?" అని అడిగారు ఆయన.

"ఆ..! నేను తప్పాలని మీరు దీవించినా ఫస్ట్ క్లాస్‌లోనే ప్యాసయ్యాను!" అన్నాడు రాజు కోపం వెళ్ళగక్కుతూ.

"నాకు తెలుసురా... నువ్వు ప్యాసవుతావని!" అన్నారు ఆయన. ఆ మాటలు అంటుంటే ఆయన కళ్ళు ఆనందంతో చెమర్చాయి.

"నువ్వు ప్యాసవ్వాలనే ఆ విధంగా రాశారా! నువ్వు మంచి కుర్రాడివి ..,తెలివి గలవాడివి. కాని, చెడు స్నేహాలతో పాడయిపోతున్నావు. ఆ స్థితిలో నేను మంచిగా చెప్పినా నీ బుర్ర కెక్కదు. అందుకే - నీలో పట్టుదల పెంచాలని ఆ విధంగా చేశాను. నేననుకున్నట్లే నీలో పట్టుదల వచ్చింది. బాగా చదివి ఫస్టున ప్యాసయ్యావు . నాకు ఎంతో ఆనందంగా ఉంది" అన్నారు సుబ్బయ్య శాస్త్రిగారు.

"మాస్టారూ..." అంటూ ఏమీ మాట్లాడలేక సిగ్గుతో తలదించుకున్నాడు రాజు.

"అవునురా! పిల్లలకి గురువుపట్ల గౌరవం ఉండాలి. విద్య యిచ్చే గురువు దేవుడితో సమానంరా. అటువంటి గురువు చెప్పే పాఠాలు వినకుండా అల్లరి చేస్తూ, ఆయన్ని ఏడిపిస్తుంటే మీకు పాఠాలు ఎలా వస్తాయిరా? భయంతో , బెదురుతూ క్లాసులోకి అడుగుపెట్టే గురువు పాఠాలు సరిగా ఎలా చెప్తాడు? ఆయన సరిగా చెప్పలేడు. మీకు సరిగా రాదు. ఇలా అల్లరి - చిల్లర పనులు చేసి కాపీలు కొట్టే మీరు పరీక్షలు ప్యాసయ్యారనుకుందాం. కానీ, మీకు విజ్ఞానం ఎక్కడినుంచి వస్తుంది? రేపు మళ్ళీ మీరే టీచర్లు అవుతారు. అప్పుడు మీ క్లాసులో పిల్లలు కూడా ఇలాగే అల్లరి చేస్తుంటే మీకు ఏమనిపిస్తుంది? ఎంత బాధగా ఉంటుంది? ఒక్కసారి ఆలోచించండి. విద్య అనేది ఒక గొప్ప అదృష్టం. స్కూల్లో మీకు పాఠాల మీద శ్రద్ధ, గురువు మీద భక్తి ఉండాలి. అప్పుడే మీకు విద్య వంటపడుతుంది.., జీవితంలో ఎంతో పైకి వస్తారు" అన్నారు మాస్టరుగారు.

"మాస్టారూ... నన్ను క్షమించండి. మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను!" అంటూ కాళ్ళమీద పడ్డాడు రాజు.

"లేరా పిచ్చివెధవా...లే! ఇంకా బాగా చదివి పైకి రా!"అంటూ ఆప్యాయంగా రాజుని లేవనెత్తారు మాస్టారు.

★★★